తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శనివారం - 28 - ఫిబ్రవరి - 2026 | సంపుటి : 3 | సంచిక : 271 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## పట్టణ పరిపాలనపై
# సీఎం సుదీర్ఘ సమీక్ష

### కోర్ అర్బన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యం
### సాంకేతిక అనుసంధానంతో స్ట్రీట్ లైటింగ్ పర్యవేక్షణ
### ఆహార నాణ్యత, అగ్నిమాపక భద్రతపై కఠిన ఆదేశాలు
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నగరాభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల భద్రత అంశాలపై విస్తృతంగా చర్చించారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నగరాల్లో చెత్త సేకరణ, వర్గీకరణ, శాస్త్రీయ నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. దోమల నివారణ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, కాలానుగుణంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలం ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలనీల్లో శుభ్రత, డ్రైనేజ్ వ్యవస్థల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని చెప్పారు.



మిగతా 2లో..

## డిల్లీ ఎక్సైజ్ కేసులో
# కవితకు క్లీన్‌చిట్

### 23 మందిపై అభియోగాలు కొట్టివేత
### కుట్ర, నేరపూరిత ఉద్దేశం లేదని కోర్టు వ్యాఖ్య
### సీబీఐ విధానంపై న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు



2లో

# మావోయిస్టు కీలక నేతల లొంగుబాటు.. అసెంబ్లీలో ప్రకటన చేస్తాం: సీఎం రేవంత్

### సచివాలయంలో మాజీ అగ్రనేతల భేటీ
### జనజీవన స్రవంతిలోకి రావాలని సీఎం సూచన

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):**

మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వెల్లడించారు. మావోయిస్టు మాజీ అగ్రనేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి చర్చలు జరిపారు. భేటీ అనంతరం సీఎం మాట్లాడుతూ జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్టపరిధిలో ఏ పని చేసినా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అయితే చట్టాలను ఉల్లంఘిస్తే ప్రభుత్వం తన విధిని నిర్వర్తిస్తుందని స్పష్టం చేశారు. శాంతి, అభివృద్ధి మార్గమే రాష్ట్రానికి అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం మాజీ మావోయిస్టు దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రివార్డు పాలసీని కోటి రూపాయలకు పెంచాలని కోరినట్లు తెలిపారు. తమకు ఐదెకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినప్పటికీ, అది సాధ్యం కాదని సీఎం చెప్పారని వెల్లడించారు. అయితే ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతితో జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలిసి, లొంగుబాట్లపై ప్రజలకు బహిరంగ లేఖ రాయాలని నిర్ణయించుకున్నట్లు దేవ్‌జీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ సిద్ధాంతం నడవదని ప్రజలకు వివరించేందుకు సిద్ధమని అన్నారు. రాష్ట్రంలో శాంతి స్థాపనకు ఇది కీలక పరిణామంగా భావిస్తున్నారు.



# సీఎం రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

- హామీల అమలుపై తీవ్ర విమర్శలు
- రైతు భరోసా నిధుల విడుదలకు డిమాండ్
- నిధులు జమ చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన హెచ్చరిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బహిరంగ లేఖ రాశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆ లేఖలో విమర్శించారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి, ఆ తరువాత మాట తప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని ఎద్దేవా చేశారు.

మిగతా 2లో..



## ప్రజాభవన్‌లో 99 రోజుల
# కార్యాచరణపై సమీక్ష

### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర ప్రణాళిక
### విభిన్న శాఖల సమన్వయానికి దిశానిర్దేశం
### పారదర్శక అమలుకు స్పష్టమైన కార్యాచరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజాభవన్‌లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో 99 రోజుల యాక్షన్ ప్లాన్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గత రెండు సంవత్సరాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరియు రాబోయే చర్యలను ప్రజలకు స్పష్టంగా తెలియజేసే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విభిన్న శాఖల సమన్వయంతో ప్రతి స్థాయిలో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పూర్తి వివరాలతో కూడిన నివేదికను సిద్ధం చేసి, ప్రజలకు స్పష్టమైన ఫలితాలు అందేలా అమలు చేయాలని పేర్కొన్నారు. పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ 99 రోజుల కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కార్యక్రమాల అమలులో సమయపాలన, సమన్వయం, సమగ్ర సమాచారాన్ని ప్రాముఖ్యంగా పరిగణించాలని సూచించారు ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపల్లి రాజేష్
తెలుగు దిన పత్రిక

## పట్టణ పరిపాలనపై
# సీఎం సుదీర్ఘ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

స్ట్రీట్ లైటింగ్ నిర్వహణలో సాంకేతికతను అనుసంధానం చేయాలని సీఎం ప్రత్యేకంగా సూచించారు. నగర వ్యాప్తంగా లైట్ల పరిస్థితిని పర్యవేక్షించే సమగ్ర వ్యవస్థ ఏర్పాటు చేసి, ఎక్కడ సమస్య తలెత్తినా కంట్రోల్ రూం ద్వారా వెంటనే స్పందించే విధానం తీసుకురావాలని ఆదేశించారు. చీకటి ప్రాంతాలు లేకుండా ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతపై కఠిన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నాణ్యతను పాటించే సంస్థలకు



గ్రేడింగ్ విధానం ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రజారోగ్యానికి భంగం కలగకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. వాణిజ్య సముదాయాలు, మాల్స్, కార్యాలయ భవనాల్లో అగ్నిమాపక భద్రతా నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాల పనితీరు, అత్యవసర మార్గాల ఏర్పాటు, సిబ్బందికి శిక్షణ వంటి అంశాలను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. భవన యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా తనిఖీలు పెంచాలని ఆదేశించారు. పట్టణాభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్ష ఫలితాలు అందించేలా ఉండాలని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. పారదర్శకత, సమయపాలన, ప్రజల సమస్యలపై తక్షణ స్పందనతో పట్టణ సేవలను మెరుగుపరచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నగరాలను సుస్థిరంగా, శుభ్రంగా, సురక్షితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగానే రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని ఫిబ్రవరి 4న మిర్యాలగూడలో ముఖ్యమంత్రి ప్రకటించారని, అయితే ఇప్పటి వరకు నిధులు జమ కాలేదని నిలదీశారు. లక్షలాది మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మూడో విడతతో కలిపి రూ.27 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధులను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ, ఆలస్యం చేస్తే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం మాట తప్పితే రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అలాగే పేదల ఇళ్ల కూల్చివేతల విషయంలో ప్రభుత్వం ఉత్సాహం చూపుతోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించే ధైర్యం ప్రభుత్వానికి లేదని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# డ్రైవర్ల కంటి పరీక్షలతో రోడ్డు భద్రతకు బలమైన అడుగు

- 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ఉచిత కంటి శిబిరం
- 400 మంది డ్రైవర్లకు పరీక్షలు
- 300 మందికి కంటి అద్దాల పంపిణీ

**వరంగల్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** డ్రైవర్ల కంటి చూపు సరిగా ఉంటే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' రెండో విడత కార్యక్రమంలో భాగంగా వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ములుగు రోడ్డులోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక నేత్ర వైద్యశాలల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. సుమారు నాలుగు వందల మందికి పైగా ఆటో డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోగా, మూడు వందల మందికి పైగా డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రయాణికులను తరలించే డ్రైవర్లు తమ కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వయస్సు పెరిగే కొద్దీ కంటి చూపు మందగించడం సహజమని, అలాంటి పరిస్థితుల్లో వాహనం నడపడం ప్రమాదాలకు దారి తీసే అవకాశముందని హెచ్చరించారు. ట్రాఫిక్ సంకేతాలు, రహదారి సూచనలను స్పష్టంగా గుర్తించాలంటే కంటి చూపు బాగుండాలని, అందుకే డ్రైవర్లు నిరంతరం కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా డ్రైవర్లకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.



# ఢిల్లీ ఎక్సైజ్ కేసులో కవితకు క్లీన్‌చిట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):**

మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసును స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ ఇవాళ కొట్టిపారేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మొత్తం 23 మందిని అభియోగాల నుంచి విముక్తి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో పాటు కవితను కూడా డిశ్చార్జ్ చేసినట్లు కోర్టు పేర్కొంది. సీబీఐ దర్యాప్తు చేపట్టిన ఈ కేసులో ఎటువంటి కుట్ర, నేరపూరిత ఉద్దేశం నిరూపించబడలేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. నిందితులపై ప్రత్యక్ష ఆధారాలు చూపించలేకపోయిందని వ్యాఖ్యానించింది. కేవలం అప్రూవర్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేయడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది.

ఒకవేళ ఇలాంటి విధానాన్ని అనుమతిస్తే రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించినట్లవుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. నిందితుడికి క్షమాభిక్ష ఇచ్చి అప్రూవర్‌గా మార్చి, అతని వాంగ్మూలం ఆధారంగా ఇతరులను తప్పుపట్టడం సరైంది కాదని ఖండించారు. ఈ నేపథ్యంలో సీబీఐ అధికారులపై శాఖాపరమైన దర్యాప్తు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ తీర్పు నేపథ్యంలో కవిత తన సామాజిక మాధ్యమ ఖాతాలో 'సత్యమేవ జయతే' అని స్పందించారు. 2022 జూలై 20న లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజా తీర్పుతో ఈ కేసుకు ముగింపు పలికినట్లైంది.

# న్యాయవ్యవస్థపై నమ్మకం నిలిచింది: కవిత

- రాజకీయ కక్షతో కేసు పెట్టారని ఆరోపణ
- కష్టకాలంలో అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు
- మరింత ఉత్సాహంతో ప్రజాసేవకు సంకల్పం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తాను మొదట్నుంచి కడిగిన ముత్యంలా బయటికి వస్తానని తెలంగాణ ప్రజలకు చెప్పానని, అదే నిజమైందని పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని ఎన్నోసార్లు స్పష్టం చేశానని, తాజా పరిణామాలతో అది నిర్ధారణ అయ్యిందని ఆమె తెలిపారు. ఈ వ్యవహారంతో తాను, తన కుటుంబం కొన్ని నెలలపాటు తీవ్ర క్షోభను అనుభవించామని చెప్పారు. విపక్షాలను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు రాకముందే తనపై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారని కవిత అన్నారు. కష్ట సమయంలో అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వారి విశ్వాసం తనకు ధైర్యం ఇచ్చిందని పేర్కొన్నారు. ఇకముందు మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తానని, ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా పనిచేస్తానని కవిత తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం మరింత బలపడిందని ఆమె వ్యాఖ్యానించారు.

# కోర్టు తీర్పులపై గౌరవం తప్పనిసరి

- కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్
- న్యాయస్థానాల తీర్పులను గౌరవించాల్సిందే
- తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్
- రాజకీయ ఆరోపణలు బాధ్యతతో చేయాలన్న సూచన

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** న్యాయస్థానాల పట్ల గౌరవం ఉన్న వ్యక్తి దానికి విరుద్ధంగా మాట్లాడరని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుల అనంతరం ప్రభుత్వ భూమిగా తేలిన ప్రాంతాల్లో అక్రమంగా ఉన్నవారిని తొలగించే చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సదరు కోర్టు తీర్పుల ప్రతులను కేంద్ర మంత్రికి పంపిస్తామని, ఆ తర్వాత విషయంపై పూర్తి అవగాహన కలుగుతుందని తెలిపారు. రాజకీయ ఆరోపణలు బాధ్యతతో చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ నివేదికతో పాటు కోర్టు తీర్పును పంపితే కేంద్రానికి స్పష్టత వస్తుందని అన్నారు.

రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని, కాళేశ్వరానికి సంబంధించిన రుణభారంలో ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో రూ.48 వేల కోట్లు చెల్లించిందని వెల్లడించారు. రెండు బడ్జెట్లలో కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా అందలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చే విధంగా కాకపోయినా కనీసం సగం అయినా తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం దౌర్భాగ్యమని పేర్కొంటూ, తెలంగాణపై వివక్ష చూపుతున్న బీజేపీ ప్రజలకు జవాబు చెప్పాలని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. రైతు భరోసా సహా ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు.

కోర్టు తీర్పులను ఎవరైనా గౌరవించాల్సిందేనని, రాజకీయ కక్ష సాధింపు ధోరణిలో బీజేపీ ముందుందని విమర్శించారు. కవితకు కోర్టులో క్లీన్ చిట్ వచ్చినా రాజకీయ అపవాదులు కొనసాగుతున్నాయని వ్యాఖ్యానించారు.

# మున్సిపల్ విజేతలకు అభినందనలు తెలిపిన కిషన్ రెడ్డి

- కోహీర్, జహీరాబాద్, సంగారెడ్డి విజేతలతో భేటీ
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచన
- అందుబాటులో ఉండాలని పిలుపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కోహీర్, జహీరాబాద్, సంగారెడ్డి మున్సిపాలిటీల నుంచి విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్లు కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన కిషన్ రెడ్డి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ ప్రతిష్ఠను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఢిల్లీ మద్యం కేసు తీర్పుపై రాజకీయ ప్రతిస్పందనలు



## సాక్ష్యాలు లేవని మాత్రమే కోర్టు వ్యాఖ్య: అరవింద్
### క్లీన్‌చిట్ కాదన్న బీజేపీ నేత.. బీజేపీ రాజకీయ డ్రామా: జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):**

ఢిల్లీ మద్యం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఊరట లభించడంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పలువురిపై నమోదైన సీబీఐ కేసును కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందిస్తూ, కోర్టు సాక్ష్యాలు లేవని మాత్రమే పేర్కొందని, కానీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. కవిత ఆరోపిస్తున్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ ఒక్కటి కాదని పేర్కొన్నారు. రాజకీయాల్లో అనేక వ్యాఖ్యలు వస్తుంటాయని, వాటన్నింటికీ స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. ఇక తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా ఈ అంశంపై స్పందించారు. ఇది బీజేపీ రాజకీయ డ్రామా అని విమర్శించారు. అవసరమైతే ఒకలా, అవసరం తీరాక మరోలా బీజేపీ వ్యవహరిస్తుందని ఆరోపించారు. శత్రువు మిత్రుడు కావొచ్చు, మిత్రుడు శత్రువు కావొచ్చని వ్యాఖ్యానించారు. ఢిల్లీ మద్యం కేసు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత ముదురుతోంది.

# పరీక్షల ఒత్తిడిపై విద్యార్థులకు అండగా టెలిమానస్ సేవలు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రకటన

మేడ్చల్ మల్కాజ్గిరి, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు)



మెడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో కొనసాగుతున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు టెలిమానస్ సేవలను విస్తృతంగా అందుబాటులో ఉంచామని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ వెల్లడించింది. పరీక్షల ఒత్తిడి, ఆందోళన, భయం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న విద్యార్థులు ఉచితంగా 14416 మరియు 1800 8914416 హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్ చేసి నిపుణులైన కౌన్సిలర్ల నుంచి మార్గదర్శకత్వం పొందవచ్చని అధికారులు తెలిపారు.విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లాలోని ప్రతి పరీక్షా కేంద్రంలో టెలిమానస్ సేవలపై పోస్టర్లు ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే విద్యార్థులను ప్రత్యక్ష మానసిక ఆరోగ్య సేవలకు రిఫర్ చేసే సదుపాయం కూడా కల్పించామని తెలిపారు.పరీక్షల అనంతరం ఫలితాల సమయంలో కూడా విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున టెలిమానస్ సేవలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సేవలను వినియోగించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమా గౌరి సూచించారు.

# వరల్డ్ అథ్లెటిక్స్ లెవెల్–2 కోచ్‌గా తిరుమల రావు బోరాడి అర్హత

మేడ్చల్ మల్కాజ్గిరి, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు)



అథ్లెటిక్స్ రంగంలో విశిష్ట గుర్తింపును సాధిస్తూ తిరుమల రావు బోరాడి వరల్డ్ అథ్లెటిక్స్ లెవెల్-2 అండర్-18 స్పెషలైజేషన్ కోచ్‌గా అర్హత పొందారు. ఇప్పటికే వరల్డ్ అథ్లెటిక్స్ లెవెల్-1 అండర్-16 కోచ్‌గా సేవలందిస్తున్న ఆయన, తాజాగా వెలువడిన ఎలిజిబిలిటీ ఫలితాల్లో లెవెల్-2 కోచ్‌గా ఎంపికై మరో మెట్టు ఎక్కారు.లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, హై జంప్, పోల్ వాల్ట్ వంటి జంప్స్ విభాగాల్లో ప్రత్యేక నైపుణ్యంతో ఆయన ఈ అర్హతను సంపాదించారు. కోచ్‌ల విద్య మరియు ధృవీకరణ వ్యవస్థలో భాగంగా నిర్వహించే ఈ పరీక్షలు ప్రపంచ అథ్లెటిక్స్, భారత అథ్లెటిక్స్ సమాఖ్య మరియు ఆసియా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతాయి.ఈ ధృవీకరణ విధానంలో లెవెల్-1, లెవెల్-2, లెవెల్-3 వంటి మూడు స్థాయిలు ఉండగా, ప్రతి దశలో సిద్ధాంతపరమైన పరీక్షలు, ప్రాక్టికల్ మూల్యాంకనం, ఇంటర్వ్యూలు మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. లెవెల్-1 కోచ్‌గా స్ప్రింట్స్, మిడిల్ & లాంగ్ డిస్టెన్స్, జంప్స్ & త్రోస్, రిలే మరియు రేస్‌వాక్ విభాగాల్లో తిరుమల రావు ఇప్పటికే తన ప్రతిభను చాటుకున్నారు.ఇప్పుడు లెవెల్-2 అర్హతతో జాతీయ, ఆసియా మరియు ప్రపంచ స్థాయిలో అథ్లెట్లకు శిక్షణ అందించే అవకాశాలు ఆయనకు విస్తరించాయి. ఈ విజయంతో ఆయన స్వస్థలంలో ఆనంద వాతావరణం నెలకొనగా, క్రీడా వర్గాల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



# శ్రీ గట్టు మల్లికార్జున స్వామి ఆలయం హుండీల లెక్కింపు

వేలేరు, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):

వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీల లెక్కింపును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈ ఓ నాగేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పట్నాలు, బోనాలు, కేశకండన, అభిషేకాలు, అర్చనల ద్వారా 36 రోజుల కాలానికి గాను రూ. 5,64,170 సమకూరగా, హుండీల ద్వారా రూ. 1,96,599 వచ్చినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

మొత్తం కలిపి రూ. 7,60,770 (ఏడు లక్షల అరవై వేల ఏడు వందల డెబ్బై) రూపాయలు వచ్చినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పల్లె నిరంజన్ రెడ్డి, సర్పంచ్ జక్కుల మౌనిక, ఉపసర్పంచ్ దయాకర్, డైరెక్టర్లు, మాజీ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.








# రాష్ట్రపతి నిలయంలో జాతీయ సైన్స్ డే వేడుకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు)

జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నేషనల్ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి నిలయం కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ రజినీప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ సైంటిస్ట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రమౌళి, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బి.సి. పరిదా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.రెండు రోజులపాటు కొనసాగనున్న విజ్ఞాన ఆవిష్కరణ ప్రదర్శనలను అతిథులు ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ ప్రఖ్యాత శాస్త్రీయ సంస్థలు తమ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేశాయి.ప్రదర్శనల్లో పాల్గొన్న *సంస్థలు*:డిఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ మరియు డయాగ్నస్టిక్స్ కేంద్రం,నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రం, సిఎస్ఐఆర్ సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, సర్వే ఆఫ్ ఇండియా,నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్,నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్.అలాగే నగరంలోని సుమారు 38 విద్యాసంస్థల నుంచి దాదాపు నాలుగువేల మంది విద్యార్థులు పాల్గొని శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాలకు సంబంధించిన వినూత్న మోడళ్లతో స్టాల్స్ ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో భాగంగా క్విజ్, సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్, పోస్టర్ మేకింగ్ వంటి పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తి పెంపొందించేందుకు, పరిశోధనాత్మక దృక్పథాన్ని ప్రోత్సహించేందుకు ఈ వేడుకలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

# సాయి దామంలో బజరంగ్ దళ్ శిక్షణ వర్గ ఏర్పాట్లపై సమీక్ష

- కుషాయిగూడలో 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని సందర్శించిన జాతీయ అధ్యక్షుడు కిషన్ ప్రజాపతి
- హిందువుల ఐక్యతే సమాజ బలం అని కార్యకర్తలకు పిలుపు

కుషాయిగూడ, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):





మార్చి 7 నుంచి 14 వరకు మేడ్చల్ -మల్కాజ్గిరి జిల్లా సాయి దామంలో నిర్వహించనున్న అఖిలభారత బజరంగ్ దళ్ శిక్షణ వర్గ (శిబిరం) ఏర్పాట్లపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా జాతీయ అధ్యక్షుడు కిషన్ ప్రజాపతి కుషాయిగూడకు విచ్చేసి స్థానిక నాయకులతో సమావేశమై శిబిర ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కుషాయిగూడ బస్ స్టాప్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం శివాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తదనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ యువత ధర్మ మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండించారు. 'లవ్ జిహాద్' పేరుతో జరుగుతున్న ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హిందువులను కులాల వారిగా విభజించి ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, హిందువులంతా సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దక్షిణ భారత్ బజరంగ్ దళ్ సంయోజక్ కుమారస్వామి, తెలంగాణ విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షులు రమేష్ బాబు, తెలంగాణ రాష్ట్ర బజరంగ్ దళ్ సంయోజక్ శ్రీకాంత్, భాగ్యనగర్ సంయోజక్ విశాల్, కుషాయిగూడ ప్రఖండ ప్రముఖ సాకేత్ అరుణ్, యశ్వంత్ సాగర్, రాగిరి వరుణ్ సాకేత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు సురేందర్ గౌడ్, ఆనంద్ గౌడ్, రేగొండ వెంకులు, లక్ష్మణ్ గౌడ్, గణేష్ గౌడ్, వెంకటాచలం, జీవీఎన్ రావు, సంపత్ రావు, సహదేవ్ గౌడ్, పిట్టల రాజు, దయానంద్, అప్పి, శ్రీకాంత్, శ్రీధర్, సోమేశ్ నాయుడు, కళావతి తదితరులు హాజరయ్యారు.శిక్షణ వర్గం విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఉపవాసాల ఉద్దేశ్యం



ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27(తెలంగాణ ముచ్చట్లు)

ఇస్లాం ధర్మం యొక్కమూల స్తంభాలలో ఉపవాసం ఒకటి. ఇది దైవానికి తప్ప మరెవ్వరికి కానరాని ఆరాధన. ఉపవాసం యుక్త వయస్సు వచ్చిన ప్రతి స్త్రీ, పురుషునిపై ఫర్జ్ (విధి)గా నిర్ణయించబడిరది. షరియత్ పరిభాషలో 'సౌమ్' (ఉపవాసం) అంటే ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు తినడం, సంభోగించడం వంటి అవసరాలను మానుకోవడం. ఇంకొక అర్థం చేస్తున్న పని నుండి ఆగిపోవడం, దానిని విడనాడటం అని అర్థం.

అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో ఈవిధంగా సెలవిస్తున్నాడు : ''విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడిరది. ఈవిధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి కూడా విధించబడిరదో. దీని వల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది.' (బఖర : 183)

ఉపవాసం వలన దైవం పట్ల భయభక్తులు జనిస్తాయని దివ్యఖుర్‌ఆన్‌లో చెప్పబడిరది. అంటే మనం చేసే ప్రతి పనిని దైవం చూస్తున్నాడని తీర్పుదినాన అన్ని పనులను సమీక్షిస్తాడని, తప్పు చేస్తే శిక్షిస్తాడని భయపడుతూ, చెడుకు దూరంగా ఉంటూ మంచికి చేరువ కావాలి. దైవం పట్ల భయభక్తులు జనించడం ఉపవాసం యొక్క ఒక ఉద్దేశ్యం. అల్లాహ్ విశ్వాసుల జీవితాలకు, దశ, దిశ నిర్దేశించే దివ్యఖుర్‌ఆన్‌లాంటి మార్గదర్శనిని పంపినప్పుడు విశ్వాసి ఉపవాసాలు పాటించి ఆ విశ్వప్రభువుకు తన కృతజ్ఞతలు తెలియజేసుకుంటాడు.

అల్లాహ్ ప్రసన్నతను పొందే మార్గం మనకు దివ్యఖుర్‌ఆన్‌లో తెల్పబడిరది. దానిని మనం స్వయంగా ఆచరిస్తూ అమలుచేస్తూ ఇతర విశ్వాసులకు కూడా తెలియజేయడానికి దివ్యఖుర్‌ఆన్‌ను మనకు పంపబడిరది. ఈ లక్ష్యం కొరకు మనల్ని తయారు చేసే ఉత్తమ మార్గం ఉపవాసం. ఉపవాసం పాటించడం కేవలం ఆరాధన కాదు కేవలం నైతిక శిక్షణ కూడా కాదు. వాటికితోడు అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌ను మనకు ఇచ్చినందుకు కృతజ్ఞత. రమజాన్ మాసంలో ఉపవాసి సృష్టికర్తతో ఎక్కువ సంబంధం కలిగివుంటాడు. ఏ పనులనైతే ఇస్లాం నిషేధించిందో వాటికి దూరంగా ఉంటాడు. సత్కర్మలను ఆచరించడానికి ప్రయత్నిస్తాడు.

ప్రతి విశ్వాసి ఉషోదయానికి ముందే ఉపవాస దీక్షను ఆరంభిస్తాడు. సుమారు 14 గంటల కాలంలో ఏమి తినడు, కనీసం మంచి నీళ్ళు కూడా ముట్టుకోడు. అతను తలచుకుంటే రహస్యంగావెళ్ళి తినవచ్చు. నీటిని త్రాగవచ్చును. కాని దైవభీతితో ఆ పని చెయ్యడు. ఎవ్వరూ చూసినాచూడకపోయినా, నా దైవం చూస్తున్నాడనే భయంతో ఆ పని చెయ్యడు. అచంచలమైన దైవభీతి అతనిలో ఉంటుంది. రమజాన్ నెలంతా అతనిలో దైవభీతి మెండుగా ఉంటుంది. రమజాన్ మాసం తర్వాత 11 నెలలలో కూడా అతను ఈ క్రమశిక్షణను అలవర్చుకోవాలి. అప్పుడే అతని ఉపవాసానికి, ఆరాధనకు సార్థకత ఏర్పడుతాయి. దైవభీతితో అబద్ధాలు చెప్పడు, వ్యభిచారానికి దూరంగా ఉంటాడు, ఇరుగుపొరుగు వారితో సఖ్యతగా ఉంటాడు. అవినీతి, లంచగొండితనానికి దూరంగా ఉంటాడు. తన కోరికలను అదుపులోఉంచుకుంటాడు. దైవాదేశ పాలనకు మనిషిని బద్ధునిగా చేయడమే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం.రమజాన్ ఉపవాసాలు భయభక్తుల శిక్షణనిస్తాయి. మనిషి శీలసంపద పెంపుకు ఉపవాస దీక్ష ఒక ముఖ్య అవసరం. విశ్వాసికి ఆకలి అంటేఏమిటో ఈ ఉపవాసాల ద్వారా తెలుస్తుంది. పేదవాడి ఆకలిబాధ ఎలా ఉంటుందో అతనికి అర్థమవుతుంది. దీనివల్ల పేదలను ఆకలితో అలమటించేవారిని ఆదుకోవాలనే తపన అతనిలో మొదలవుతుంది.

అందుకే మహాప్రవక్త ముహమ్మద్ (స) రమజాన్ మాసాన్ని సానుభూతి మాసం అన్నారు. పేదల పట్ల ప్రేమ, సానుభూతిని చూపించమన్నారు.

ఉపవాసాల యొక్క ముఖ్యోద్దేశాలలో 'సహనం వహించటం' ఒకటి. రమజాన్ మాసంలో ఉపవాసాలు ఉండటం వలన విశ్వాసికి సహన గుణం అలవడుతుంది. అతను తన జీవితంలో ఎదురయ్యే క్లిష్ట సమస్యలను సహనంతో, ఓర్పుతో ఎదుర్కొంటాడు. రోజా ఉద్దేశ్యం సత్యం పలకటం, మంచి ఆచరణల గురించి శిక్షణనివ్వడమేనని హదీసుల ద్వారా తెలుస్తుంది. ఉపవాసం యొకక ఉద్దేశ్యాలలో ఒకటి ఏమిటంటే ఉపవాసం పాటించే వ్యక్తులలోచెడును అరికట్టి మంచిని పెంపొందింపజేయడం. అందుకే దైవప్రవక్త(స) ఉపవాసాన్ని ఢాలు వంటిదిఅన్నారు. ఏవిధంగా ఢాలు సైనికుణి శత్రుదాడి నుండి రక్షిస్తుందో అదేవిధంగా రోజా మనిషిని చెడునుంచి రక్షిస్తుంది. ఉపవాసం మనలోసమయపాలనను పెంపొందిస్తుంది. ఉపవాసం ముఖ్య ఉద్దేశ్యాలలో దైవం యొక్క ఔన్నత్యాన్ని కొనియాడటం ఒకటి.

దైవం మనందరికి రమజాన్ ఉపవాసాలు పాటించే సద్భాగ్యాన్ని, మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించుగాక! (ఆమీన్)

-అబ్దుల్ మలిక్ (ఖమ్మం)

# ఖురాన్ తోనే క్రమశిక్షణ అలవడుతుంది

ఇస్లాం పండితుడు అబ్దుల్ ఖవీ

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి, 27(తెలంగాణ ముచ్చట్లు)



పవిత్ర ఖురాన్ గ్రంధం మనిషి పరిపూర్ణ జీవన విధానానికి దిక్సూచి వంటిదని, దాన్ని చదివి ఎవరైతే అమలు చేస్తారో వారి జీవితంలో చక్కని క్రమశిక్షణ అలవడుతుందని ప్రముఖ ఇస్లాం ఆధ్యాత్మిక పండితుడు మహ్మద్ అబ్దుల్ ఖవి అన్నారు. అందుకే ప్రతి ఒక్క ముస్లిం ఖురాన్ గ్రంధాన్ని ప్రేమించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. నగర శివారు గొల్లగూడెం లోని తాలిముల్ ఇస్లాం మదర్సాలో రంజాన్ మాస తొమ్మిది రోజుల్లో తరవిహ్ నమాజ్ నందు ఖురాన్ పఠనం పూర్తయిన సందర్భంగా ఖత్మే ఖురాన్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్సా ఆవరణలోని మసీదు ప్రాంగణంలో ఆధ్యాత్మిక సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అబ్దుల్ ఖవి మాట్లాడుతూ.. ఎంత పెద్ద బాధల్లో ఉన్న వ్యక్తి అయినా.. కొద్దిసేపు ఖురాన్ చదివితే మనసుకు ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అంతటి గొప్ప శక్తి ఉన్న గ్రంధం ఖురాన్ ను.. రంజాన్ మాసం లో ప్రత్యేకంగా రోజుకొకసారైన చదవడం అలవార్చుకోవాలని సూచించారు. తరావిహ్ నమాజ్ రంజాన్ నెలంతా చదవాల్సిందేనని.. దానికి ఎటువంటి మినహాయింపు ఉండదనే విషయం గ్రహించాలని అబ్దుల్ ఖవి సూచించారు. ఖత్మే ఖురాన్ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం మదర్సా ట్రస్ట్ సభ్యులు అబ్దుల్ ఖవి ని శాలువతో ఘనంగా సత్కరించారు. మదర్సా నిర్వాహకుడు ముఫ్తి అబ్దుల్ రవూఫ్ ఖాన్, ముఫ్తి జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నగర ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గా డా . కే.వి.కృష్ణారావు ఎన్నిక

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గా డా . కే.వి. కృష్ణారావు ను ఎన్నికచేస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ ప్రకటించారు. తనికి ఇచ్చిన ఈ పదవి పట్ల డా.కే.వి. కృష్ణా రావు సంతోషము వ్యక్తం చేస్తూ , పదవిని ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షుడు కి ప్రత్యేక ధన్యవాదాలను ,కృతజ్ఞతల ను తెలియ చేశారు. ముమ్ముందు రెట్టింపు ఉత్సాహం తో తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం,వారి సంక్షేమం కోసం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయించడం కోసం పోరాడుతానని అన్నారు.



## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిని కలిసిన ఎదులాపురం 20, 21 వార్డుల కౌన్సిలర్లు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు)

పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డిని ఎదులాపురం మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ గూదె మల్లయ్య, 21వ వార్డు కౌన్సిలర్ కోటమర్తి సునీత కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మండల నాయకులు గోనె భుజంగ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఎంపీ నివాసానికి వెళ్లగా.. ఈ సందర్భంగా నూతన కౌన్సిలర్లను ఆయన అభినందించారు. ప్రజా పాలనలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేగర్ల రాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మద్దిగట్ల–మోజర్ల ప్రభుత్వ పాఠశాలలో సర్పంచుల సమీక్ష సమావేశం

- పదవ తరగతి ఫలితాల మెరుగుదలపై దృష్టి

పెద్దమందడి,ఫిబ్రవరి27 (తెలంగాణ ముచ్చట్లు):

పెద్దమందడి మండలం మద్దిగట్ల-మోజర్ల జిల్లా పరిషత్ పాఠశాలను మద్దిగట్ల గ్రామ సర్పంచ్ మేకల రాములు,మోజర్ల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ పర్యటించి పదవ తరగతి విద్యార్థుల బోధన విధానం, విద్యా ప్రమాణాలు మరియు ప్రతిభా పాటవాలను పరిశీలించారు. పదవ తరగతి ఫలితాల మెరుగుదల లక్ష్యంగా ఉపాధ్యాయులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.విద్యార్థుల విద్యా పురోగతిపై వివరాలు తెలుసుకుని, బలహీన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఉత్తీర్ణత శాతం పెంపుతో పాటు మెరుగైన గ్రేడ్‌లు సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు, ఉపాధ్యాయులు డి. రణదీవ్, పి. వెంకటస్వామి, గద్వాల కృష్ణయ్య, పుల్లయ్య, ఏ. వెంకటస్వామి, వాణి ప్రభ, శ్రీనివాసులు, ఎన్. వెంకటస్వామి, చిన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.పాఠశాల అభివృద్ధికి గ్రామస్థుల సహకారం కీలకమని, సమష్టి కృషితో పదవ తరగతి ఫలితాల్లో మెరుగైన విజయాలు సాధించాలని సర్పంచులు సూచించారు.



## మోజర్లలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం

- మోజర్ల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్

పెద్దమందడి,ఫిబ్రవరి27 (తెలంగాణ ముచ్చట్లు):

పెద్దమందడి మండలం మోజర్ల గ్రామం 1వ వార్డులో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యపై గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ స్పందించారు.సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వార్డులో నీటి సరఫరా అంతరాయం కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పాత పైపులైన్ లోపాలను సరిచేసి, కొత్త పైపు కనెక్షన్ ఏర్పాటు చేయడంతో నీటి సరఫరా మెరుగుపడిందన్నారు.అవసరమైతే మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, రానున్న ఎండాకాలం తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు.గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి వార్డులో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని సర్పంచ్ తెలిపారు. స్థానికులు ఈ చర్యలపై హర్షం వ్యక్తం చేశారు.

## అనారోగ్యంతో పోరాడుతున్న సభ్యునికి టిడబ్ల్యూజేఎఫ్ అండ

- ఆర్థిక సహాయం అందించిన నాయకత్వం

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 27(తెలంగాణ ముచ్చట్లు)





తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్-2843) ఖమ్మం జిల్లా కమిటీ తమ సభ్యుని సంక్షేమం విషయంలో మానవత్వాన్ని చాటుకుంది. తీవ్ర అనారోగ్యంతో ఖమ్మం నగరంలోని కార్తీక్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మర్కారపు (బస్టాండ్) రమేష్‌ను జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్ ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించి సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేశారు. సభ్యుల కష్టసుఖాల్లో తోడుగా నిలవడం తమ కర్తవ్యమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రమేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైద్యుల నుంచి రమేష్ ఆరోగ్య పరిస్థితి వివరాలు తెలుసుకున్న నాయకులు, మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. అవసరమైన పరీక్షలు, చికిత్సలు సమగ్రంగా చేపట్టి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమమే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్ 2843) ధ్యేయమని, అత్యవసర సమయంలో సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ, ఈసీ సభ్యులు ఓరుగంటి కిరణ్, లింగాల రామ్మూర్తి, కొణతాలపల్లి నాగేశ్వర రావు, టీబీజేఎ జిల్లా కోశాధికారి కాసోజు శ్రీధర్, నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, పట్టణ కార్యదర్శి కప్పల మధు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఐక్యతను చాటుకున్నారు.

## నాయకన్ గూడెంలో పీవీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27(తెలంగాణ ముచ్చట్లు): మండల పరిధిలోని నాయకన్ గూడెంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గొల్లపూడి వీరన్న నూతనంగా నిర్మించిన 'పీవీ (పవన్)ఫంక్షన్ హాల్'ను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం రిబ్బన్ కట్ చేశారు.



ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వసతులు ఉండటం సామాజిక కార్యక్రమాలకు దోహదపడుతుందని అన్నారు. వివాహాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు ఈ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీగ్రామ అధ్యక్షుడు గొల్లపూడి వీరన్న, సూర్య కళ దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఎంపీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచరి సైదమ్మ కొండల్, ఉపసర్పంచ్ భీష్మాచారి, మండల నాయకులు బజ్జూరి వెంకటరెడ్డి, కొమురెల్లి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంచర్ల సుధీర్ రెడ్డి, నాయకులు కంచర్ల వీరారెడ్డి, కంచర్ల పవన్ రెడ్డి, మైనారిటీ నాయకులు ఎండి. జహంగీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు

కీసర, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):






తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026' (ఫేజ్-2) కార్యక్రమంలో భాగంగా మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా చీర్యాల ప్రాంతంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజ్లో విద్యార్థులకు ప్రత్యేక రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి అంజనేయులు, జవహర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.అధికారులు మాట్లాడుతూ వేగ నియంత్రణ ప్రాముఖ్యత, లేన్ క్రమశిక్షణ, చిన్న రోడ్ల నుండి ప్రధాన రహదారుల్లోకి ప్రవేశించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భారీ వాహనాల డ్రైవర్ల బాధ్యతలపై వివరించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని, మద్యం సేవించి వాహనం నడపడం మరియు డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు.యువత రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించి, కుటుంబ సభ్యులు మరియు స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు భూమిపూజ

- రూ.1.8 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచాలి: ఈటల రాజేందర్

మల్లాపూర్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):





మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కొత్త భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల కింద రూ.1.8 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణ పనులను టెక్నిప్ ఎఫ్ఎంసి సంస్థ, అమలు భాగస్వామి హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా ఆధ్వర్యంలో చేపడుతున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక మాజీ కార్పొరేటర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కష్టం తెలియని వారు అధికారులైతే మానవతా దృక్పథం లోపిస్తుందని అన్నారు. పేదరికం నుంచి వచ్చినవారికి ప్రజల సమస్యలు బాగా అర్థమవుతాయని, వారు సేవాభావంతో పనిచేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులు ఉన్నారని, వాటి అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు.బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, సంస్థలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లే తాను కూడా పేద విద్యార్థులకు, ముఖ్యంగా వైద్య విద్య అభ్యసిస్తున్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నానని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం ప్రజలు, సంస్థలు, ప్రజాప్రతినిధులు కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కొత్త భవనంతో విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందుబాటులోకి వస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భరత్ నగర్ కాలనీలో "బస్తీ బాట" ప్రజా సమస్యలపై కాంగ్రెస్ భరోసా

- కాలనీలో పర్యటించిన నెమలి అనిల్ కుమార్
- తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ

మల్లాపూర్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు)

ఉప్పల్ నియోజకవర్గం ఉమ్మడి మల్లాపూర్ పరిధిలోని శక్తిసాయి నగర్ డివిజన్‌కు ఇటీవల విలీనం అయిన భరత్ నగర్ కాలనీలో "బస్తీ బాట" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, దోమల సమస్య, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక వసతుల కొరతపై స్థానికులు వివరించిన సమస్యలను ఆయన శ్రద్ధగా విన్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో భరత్ నగర్ కాలనీలోని ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని నెమలి అనిల్ కుమార్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సద్గుణ, మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, వుండం శ్రీనివాస్, లక్ష్మీపతి, సురేష్ గౌడ్, కంపెల్లి శివ, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బాతరాజు రాహుల్ తదితరులతో పాటు కాలనీకి చెందిన పలువురు స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## ఆగారంలో రెడ్ల కుంట చెరువు తూములను పరిశీలించిన అధికారులు

- త్వరలో మరమ్మతు పనులు ప్రారంభం
- నీటిపారుదల శాఖ అధికారులు



**ఖిల్లా ఘనపూర్,ఫిబ్రవరి27 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఘనపూర్ మండలం పరిధిలోని ఆగారం గ్రామంలో ఉన్న రెడ్ల కుంట చెరువు తూములను నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించారు. చెరువు తూముల స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన మరమ్మతు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. చెరువులో నీటి నిల్వ మరియు సాగునీటి సరఫరాకు తూములు కీలకమని అధికారులు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తూముల బలపరిచే పనులతో పాటు అవసరమైన చోట పునర్నిర్మాణ చర్యలు చేపడతామని వెల్లడించారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు మున్నూరు జయాకర్, గ్రామ సర్పంచ్ నర్సమ్మ, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. చెరువు పనులు త్వరగా ప్రారంభించాలని రైతులు కోరగా, అధికారులు సానుకూలంగా స్పందించారు.



## తాటిపాముల కుంటివాని తాండలో గండదీపం–గరుడస్తంభం భూమిపూజ

**వనపర్తి,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీరంగాపూర్ మండలం పరిధిలోని తాటిపాముల గ్రామం కుంటివాని తాండలో శుక్రవారం గండదీపం, గరుడస్తంభం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ్యుడు లోక్యా నాయక్ ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, గ్రామ సర్పంచ్ శిరీష మధు పాల్గొన్నారు .ఈ సందర్భంగా తాండలో చేపడుతున్న అభివృద్ధి పనులు అభినందనీయమని వారు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.అనంతరం రాజు నాయక్, బరికి చంద్రయ్య గృహ ప్రవేశం చేసిన సందర్భంగా వారి ఇళ్లను సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో తాండ వార్డు సభ్యుడు లోక్యా నాయక్, మాజీ సర్పంచ్ సత్యం యాదవ్, వార్డు సభ్యులు వెంకటేష్, సురేష్, చంద్రాయుడు, బుచ్చన్న, మాజీ ఉపసర్పంచ్ బాలరాజు, కుమ్మరి ఆంజనేయులు, భాస్కర్, రాములు, హరికృష్ణ, నాగరాజు, రాజు నాయక్, డా. నారాయణ్, సుధాకర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



## మార్చి 06న భద్రాచలంలో శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మదిన వేడుకలు

- ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు.

**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 27, (తెలంగాణ ముచ్చట్లు):** లంబాడీల గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు సమక్షంలో మార్చి 06 శుక్రవారం రోజున ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో భోగ్ బండారో కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తెలిపారు. శుక్రవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు క్యాంప్ కార్యాలయంలో లంబాడీల జేఏసీ నాయకులతో కలిసి మీటింగ్ ఏర్పాటు చేసినారు కొన్ని అనివార కారణాలవల్ల ఫిబ్రవరి 28 న జరగవలసిన జయంతి ఉత్సవాల భోగ్ బండారో కార్యక్రమం మార్చి 06 న మార్చటం జరిగింది. కావున ఈ కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గం లోని గిరిజన లంబాడీలు, మరియు సోదర సోదరీమణులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు లంబాడీల ఉద్యోగులు, లంబాడీల కుల పెద్దలు, యువతీ యువకులు, మేధావులు, రాజకీయ ప్రముఖులు, పుర ప్రముఖులు, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో డీ.హరిచంద్ర నాయక్, లకావత్ వెంకటేశ్వర్లు, భూక్యా రంగా, బి బన్సీలాల్, బి గోవింద్, బి మదర్ నాయక్, టి బాలు నాయక్, టి మోహన్ లాల్ , బి తార చంద్, బి కిషన్, బి గోపాల్ కృష్ణ, డి సైదులు, జె ఈశ్వర్, జి రాందాస్, భూక్యా సాయి కౌశిక్, బి బిచ్చ, తదితరులు పాల్గొన్నారు.



## కరుణగిరి యూత్ క్రికెట్ టోర్నీ బ్రోచర్ ఆవిష్కరించిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27(తెలంగాణ ముచ్చట్లు ):** కరుణగిరి యూత్ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుంచి పాలేరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పోటీలు కేంద్రీయ విద్యాలయ రోడ్ మైదానంలో జరుగనున్నాయి.

టోర్నీ నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ యువనేత ఏనుగు మహేష్ ఆధ్వర్యంలో ఎంపీని వారి నివాసంలో కలసి బ్రోచర్‌ను విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఇటువంటి టోర్నమెంట్ల నిర్వహణ అవసరమని పేర్కొంటూ..పోటీలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో.. టోర్నీ నిర్వాహకులు అక్కిరాజు నరేష్, పీ.సంపత్, జి. శ్రీకాంత్, నాయుడు, పవెల్, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం

**రిలే నిరాహార దీక్షలకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మద్దతు**



**వనపర్తి,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి లో గత నాలుగు రోజులుగా న్యాయవాదులు తమ రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సందర్శించి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పెడధోరణులు పెరుగుతున్న నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ కరువవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.న్యాయవాదుల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి కేసునైనా వాదించకూడదనే హక్కు న్యాయవాదికి ఉండదని, కక్షిదారునికి న్యాయం చేయడమే వారి వృత్తి ధర్మమని స్పష్టం చేశారు. అంతమాత్రాన వ్యక్తిగత కక్ష పెంచుకొని దాడులకు దిగడం అవివేకమని పేర్కొన్నారు.సమాజ పరిస్థితులు ఎలా ఉన్నా యువ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదుల సలహాలు తీసుకుని న్యాయాన్ని నిలబెట్టాలని సూచించారు.వృత్తిలో ఈర్ష్య, ద్వేషాలు విడిచి తమ ప్రతిభతో మంచి పేరు సంపాదించుకోవాలని కోరారు. న్యాయవాదులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని నిరంజన్ రెడ్డి తెలిపారు.

# మానవ మనుగడకు సైన్స్ కీలకం: ఎమ్మెల్యే మట్టా రాగమయి

- విశ్వశాంతి విద్యాలయంలో ఘనంగా ముగిసిన సైన్స్ వారోత్సవాలు.




**సత్తుపల్లి, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** మానవ మనుగడకు సైన్స్ కీలకమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం (ఫిబ్రవరి 28) పురస్కరించుకుని స్థానిక పట్టణంలో విశ్వశాంతి విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ వారోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు రూపొందించిన సుమారు 200 ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రదర్శనలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయోగాల ద్వారా నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, సైన్స్‌పై ఆసక్తి పెరుగుతాయని తెలిపారు. చిన్ననాటి నుంచే లక్ష్యం ఏర్పరచుకుని దాని సాధనకు కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెహనా బేగం కమల్, వైస్ చైర్మన్ బొంత సుమలత మాట్లాడుతూ మానవ మనుగడ సైన్స్‌తోనే ముడిపడి ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు కమల్ పాష, వార్డ్ కౌన్సిలర్ అపర్ణ తదితరులు విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ 95వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ



**ఏ ఎస్ రావు నగర్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు)** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ లో కమలానగర్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ 95వ వర్ధంతి సందర్భంగా కమలానగర్ కార్యాలయంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, స్ఫూర్తి గ్రూప్ నాయకులు బంగారు నర్సింగ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సభ్యులందరూ పుష్పాంజలి ఘటించారు.

అధ్యక్షుడు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, చిన్న వయసులోనే బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ధీరుడు చంద్రశేఖర్ ఆజాద్ అని కొనియాడారు. 15 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నినాదాలు చేసినందుకు కొరడా దెబ్బల శిక్షను అనుభవించారని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహా విప్లవకారుడని పేర్కొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ నాయకుడు బంగారు నర్సింగ్‌రావు మాట్లాడుతూ, తాను రచించిన చంద్రశేఖర్ ఆజాద్‌పై వ్యాసం "ధరణి" పత్రికలో ప్రచురితమైందని తెలిపారు. ఆ వ్యాసంలోని ముఖ్యాంశాలను సభికులకు చదివి వినిపించారు.సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ, ఆజాద్ పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బంగారు నర్సింగ్‌రావు, అశోక్, ఎన్. శ్రీనివాస్, జి. శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసరావు, గౌసియా, వెంకన్న, లక్ష్మయ్య, గణేష్, రాజశేఖర్, లింగస్వామి, సత్యనారాయణ, ఉన్నికృష్ణన్, రవి, శివరామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన పంటల రైతుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో విత్తన పంటలు సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణ రైతు సంఘం కమిషన్ అధ్యక్షుడు కోదండ రెడ్డి మరియు సభ్యులను కలిసి వివరించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రైతులు అరవై రకాల విత్తనాలను పండిస్తూ రాష్ట్రాన్ని దేశంలో విత్తనాల నిల్వ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. అయితే 2007లో అమలులోకి వచ్చిన ఒప్పంద సాగు చట్టం ప్రకారం రైతులకు కలగాల్సిన హక్కులు పూర్తిగా అమలవడం లేదని విమర్శించారు. రైతుకు మేలు చేసే విధంగా ఆ చట్టాన్ని వినియోగించడం లేదన్నారు.

ప్రత్యేకంగా విత్తన పత్తి రైతులకు ఇచ్చే ముందస్తు చెల్లింపులపైనా వడ్డీలు వసూలు చేస్తూ భూములను తనఖా పెట్టించుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా పరిపాలనాధికారులు, వ్యవసాయ అధికారులు రైతుల పక్షాన నిలవడం లేదన్నారు. చట్టంలో ఉన్న లోపాలను సవరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కరీంనగర్ ప్రాంతంలో వరివిత్తనం పండిస్తున్న రైతులకు ఎకరానికి 75 వేల రూపాయలు ఇస్తున్నప్పటికీ, గద్వాల్ ప్రాంతంలో విత్తన పత్తి రైతులకు ముందస్తు చెల్లింపులు, మందుల ఖర్చులకే భూములు తనఖా పెట్టించుకుంటున్నారని తెలిపారు. అదనంగా 250 గ్రాముల తరుగు కూడా తీసుకుంటున్నారని చెప్పారు.కరీంనగర్‌లో వరివిత్తనం రైతులకు కొనుగోలు అనంతరం మిగిలిన పంటను స్వేచ్ఛగా విక్రయించే అవకాశం ఉండగా, గద్వాల్‌లో విత్తన పత్తి రైతులు పలు స్థాయిల్లో మోసాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన పత్తి నిర్వాహకులు, మధ్యవర్తులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు.

ఎకరానికి నిర్ణయించిన మొత్తాన్ని పంట వచ్చినా రాకపోయినా రైతులకు చెల్లించాలని, పంట విఫలమైతే రైతుల మానసిక స్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని చట్టంలో ఉన్నప్పటికీ సంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. గద్వాల్ జిల్లాలో పది వేల మంది విత్తన పత్తి రైతులకు సుమారు రెండు వందల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని తెలిపారు.

విత్తనం సంస్థలు ఇచ్చిన విత్తనం విఫలమైతే దానికి రైతుకు సంబంధం ఉండకూడదని, సంస్థలే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అత్యంత ప్రమాదకరమైన మందుల విక్రయాలపై నియంత్రణలు తీసుకురావాలని, కనీసం పరిమిత విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రైతు కమిషన్ జోక్యం చేసుకుని విత్తన పంటల రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రామీణాభివృద్ధి–మహిళా సాధికారతకు ప్రాధాన్యం


- దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే జారె పర్యటన.



**దమ్మపేట, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళా సాధికారత, విద్యా వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. పూసుకుంట గ్రామపంచాయతీలో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం కమ్యూనిటీ భవనం, జీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆర్లపెంటలో మహిళా సంఘాల కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. పట్వారిగూడెం పంచాయతీ సుధాపల్లి గ్రామంలో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టగా, రాచూరుపల్లి పంచాయతీ పాతలచ్చాపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జమేదార్ బంజర పంచాయతీ గుర్వాయిగూడెం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని అర్బన్ కాలనీలో అంగన్వాడీ నూతన భవనాన్ని ప్రారంభించి, సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ముష్టిబండ పంచాయతీ అప్పారావుపేటలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వడ్లగూడెం, మారప్పగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. చీపురుగూడెంలో ఎంపీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ పనులు ప్రారంభించారు. అంకంపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమాల్లో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన బానోత్ లక్ష్మణ్ నాయక్ దంపతులకు సన్మానం

**ములుగు,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):** ములుగు జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో పదవి విరమణ పొందిన బానోత్ లక్ష్మణ్ నాయక్ దంపతులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బంజారా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వి.ఎన్. నాయక్, గౌరవాధ్యక్షుడు పోరిక జవహర్ లాల్ శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి లక్ష్మణ్ నాయక్ దంపతులను సత్కరించారు. ఉద్యోగ కాలంలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లాల్, లావుడియా రాజు నాయక్, భూక్య శ్రావణ్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. పదవి విరమణ అనంతరం కూడా సమాజానికి సేవలు కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రాష్ట్రంలోనే తొలిసారి 'ఇందిరమ్మ–రేవంత్ రెడ్డి కాలనీ'

- **కొత్తూరులో 67 ఇళ్లతో సామూహిక గృహప్రవేశాలు.**
- **పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ఆధునిక వసతులతో నిర్మాణం.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామంలో నిర్మించిన 67 ఇందిరమ్మ ఇళ్ల సముదాయానికి "ఇందిరమ్మ-రేవంత్ రెడ్డి కాలనీ"గా నామకరణం చేస్తూ శుక్రవారం సామూహిక గృహప్రవేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవిలో ఉండగానే వారి పేరుతో కాలనీకి నామకరణం చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం.

గతంలో "రేకుల కాలనీ"గా ఉన్న ఈ ప్రాంతం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో నూతన రూపు సంతరించుకుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై లబ్ధిదారులను గృహాల్లోకి పంపించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా కొత్తూరును పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపిక చేసి కాలనీని నిర్మించినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు అందించామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల నిర్మాణాలతో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకుంటుండటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఆర్‌వో, హౌసింగ్ ఏఈ, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ ప్రమీల రాణి మృతి

- **శారదా బస్ స్టాప్ జంక్షన్ వద్ద కారు ఢీకొనడంతో దుర్ఘటన**

**కుషాయిగూడ, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు)**

మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని కలిగించింది. పోలీసుల వివరాల ప్రకారం, మణికొండ జాగీర్ ప్రాంతానికి చెందిన బద్దురు బ్రహ్మ రెడ్డి (70) ఫిబ్రవరి 26 ఉదయం కుషాయిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, ఫిబ్రవరి 25 రాత్రి సుమారు 11:55 గంటల సమయంలో ఆయన వియ్యంకులు అవుల వెంకట్ రెడ్డి మరియు ఆయన భార్య ఎ. ప్రమీల రాణి మోటార్ సైకిల్‌పై నేరేడ్మెట్ వైపు నుండి ఏఎస్ రావు నగర్ వైపు వస్తుండగా శారదా బస్ స్టాప్ జంక్షన్ వద్ద (రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా) ఒక కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రమీల రాణి అపస్మారక స్థితికి చేరుకోగా, ఆమెను ఈసీఐఎల్‌లోని శ్రీకర హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. అవుల వెంకట్ రెడ్డికి



ఎడమ కాలు విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, కారు నడిపిన వ్యక్తిని దొడ్డల తరుణ్ (31), నివాసం సాయినాథ్‌పురం, నేరేడ్మెట్‌గా గుర్తించారు. ఇదిలా ఉండగా, ఫిబ్రవరి 27 సాయంత్రం సుమారు 4:12 గంటలకు చికిత్స పొందుతుండగా ప్రమీల రాణి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించగా, కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.



## కొడకండ్ల సదాంత్ ఆధ్వర్యంలో ఉచిత లేబర్ కార్డుల నమోదు

**వరంగల్,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):**

భారత రాష్ట్ర సమితి మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ సూచనల మేరకు 29వ విభాగ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉచిత కార్మిక గుర్తింపు పత్రాల(లేబర్ కార్డు) నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సదాంత్ మాట్లాడుతూ కార్మిక గుర్తింపు పత్రం ద్వారా లభించే ప్రయోజనాలను విభాగ ప్రజలకు వివరించారు. సహజ మరణం సంభవించినప్పుడు రెండు లక్షల రూపాయల భీమా సదుపాయం, ప్రమాదవశాత్తు మరణం లేదా తీవ్ర గాయాల పక్షంలో పది లక్షల రూపాయల వరకు భీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. వివాహం మరియు ప్రసవ సందర్భాల్లో కూడా ముప్పై వేల రూపాయల ఆర్థిక సహాయం అందే అవకాశముందని పేర్కొన్నారు. కాకతీయ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు వేల్పుల రవీందర్ మాట్లాడుతూ మొత్తం 150 కార్మిక గుర్తింపు పత్రాలను ఉచితంగా నమోదు చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో విభాగ ప్రజలతో పాటు బొమ్మకంటి క్రాంతి, అడుపా అరుణ్, ఆరూరి రాకేష్, ఎర్రబెల్లి నాగరాజు, కందుకూరి రమేష్, పానుగంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ముందస్తు జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాల నివారణ

- **పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27(తెలంగాణ ముచ్చట్లు)**

ముందస్తు జాగ్రత్తలు పాటించడంతోనే రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.

రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతిష్ఠాత్మకంగా పోలీసుశాఖ రూపొందించిన 'అరైవ్.. అలైవ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రియదర్శని ఇంజనీరింగ్ కాలేజ్ లో విద్యార్థులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదల్లో గాయపడిన వారు కుటుంబ పోషణకు పడుతున్న ఇబ్బందులు,అనుభవాలను బాధితులు పంచుకున్నారు. విద్యార్థులు ఆటో డ్రైవర్లు ఆటో యూనియన్లు, లారీ యూనియన్లు,కళాశాల అధ్యాపకులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురక్షితంగా గమ్యానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వివరించారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి, రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రముఖులు, మీడియా, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతలో తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది తమ ధ్యేయమని పేర్కొన్నారు.





ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడడం, మద్యం సేవించి నడపడం, సిగ్నల్ జంప్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోల ఓవర్ లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్ టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ఈ ప్రచారంలో ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.

చలికాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డు, ఎదురుగా వచ్చే వాహనాలు, పాదచారులు, జంతువులు, ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా కనిపించవు. ముందున్న వాహనం లేదా ఆగి ఉన్న వాహనం ఎంత దూరంలో ఉందో అంచనా వేయడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో, డ్రైవర్లు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని, వాన కాలం, చలి కాలంలో డ్రైవర్లు తీసుకోవలసిన కీలక జాగ్రత్తలు

**1.ముందుగానే ప్రయాణం మొదలు పెట్టండి**

పొగమంచు వలన ఆలస్యం అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి గమ్యస్థానానికి చేరుకోవాల్సిన సమయాన్ని దృష్టిలో ఉంచుకొని, నిర్ణీత సమయం కంటే కొద్దిగా ముందుగానే బయలుదేరండి. తొందరపాటును నివారించడం ద్వారా డ్రైవింగ్ పై ఏకాగ్రత పెరుగుతుంది.

**2.అతివేగం, ఓవర్ టేకింగ్‌కు దూరంగా ఉండండి**

ముందున్న వాహనాలు, రోడ్డు స్పష్టంగా కనిపించనందున అతివేగం, ఓవర్ టేకింగ్ అత్యంత ప్రమాదకరం. వేగంగా వెళ్లడం వలన వాహనం నియంత్రణ (కంట్రోల్) తప్పే ప్రమాదం ఉంది. ఓవర్ టేకింగ్ చేసేటప్పుడు ఎదురుగా ఉన్న వాహనం ఎంత దూరంలో ఉందో అంచనా వేయడం కష్టం.

**3.లో-బీమ్ లైట్లనే వాడండి**

పొగమంచులో హైబీమ్ లైట్ల నుండి వచ్చే కాంతి విచ్ఛిన్నమై, ఎదురుగా చూడటం మరింత కష్టమవుతుంది. కాబట్టి, తప్పనిసరిగా లోబీమ్ హెడ్‌లైట్లను మాత్రమే వాడండి. ఫాగ్ లైట్లు ఉన్న యెడల, వాటిని కూడా ఉపయోగించాలి. ఇది మీ వాహనం ఎంత దూరంలో ఉందో ఇతరులకు స్పష్టంగా తెలుపుతుంది.

**4.సురక్షిత దూరాన్ని పాటించండి**

ముందు ఉన్న వాహనానికి, మీ వాహనానికి మధ్య తగినంత సురక్షిత దూరాన్ని ఉంచండి. దీనివలన ముందు వాహనం సడన్ బ్రేక్ వేసినా, అంచనా తప్పినా దాన్ని ఢీకొట్టకుండా నివారించవచ్చు.

**5.**నిర్దేశించిన లేన్లలోనే నడపండి ఇష్టం వచ్చినట్లు లేన్ క్రమశిక్షణ లేకుండా నడపడం వలన ముందున్న వాహనాలను గుర్తించడం కష్టమవుతుంది. నిర్దేశించబడిన లేన్లలో మాత్రమే వాహనాన్ని నడపండి.

**6.**కిటికీ అద్దాలను కొద్దిగా దించండి వాహనాన్ని నడిపేటప్పుడు కిటికీ అద్దాలను కొద్దిగా దించడం వలన (పాక్షికంగా తెరవడం), పొగమంచు ఒకేదగ్గర కేంద్రీకృతం కాకుండా విచ్ఛిన్నమవుతుంది. దాని వలన డ్రైవర్ దృష్టి మెరుగు పడుతుంది.

**7.ఎక్కువ పొగమంచు ఉంటే వాహనం ఆపండి**

కొన్నిసార్లు పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ముందు ఉన్న వాహనాలు, రోడ్డు సరిగ్గా కనిపించకపోతే, గమ్యస్థానానికి వెళ్లాలనే తొందరలో తప్పులు చేయకుండా, సురక్షిత ప్రదేశంలో కాసేపు వాహనాన్ని ఆపివేసి, మళ్లీ ప్రయాణం కొనసాగించండి.

**8.**అద్దాలను శుభ్రంగా ఉంచుకోండి పొగమంచు అద్దాలను కవర్ చేయడం వలన డ్రైవర్ దృష్టి తగ్గుతుంది. మీ వాహనం యొక్క ముందు, వెనుక కిటికీ అద్దాలను శుభ్రంగా ఉంచుకోండి. అవసరాన్ని బట్టి వైపర్లను, డీఫ్రాస్టర్లను వాడుతూ అద్దాలను స్పష్టంగా ఉండేలా చూసుకోండి.

**9.ఇండికేటర్లను ముందుగా ఉపయోగించండి**

మీరు ఎటువైపు వెళుతున్నారో వెనుక వచ్చే వాహనానికి ముందుగానే తెలిసేలా ఇండికేటర్లను ముందుగా ఉపయోగించండి. వెనుక వచ్చే డ్రైవర్లకు నిర్ణయం తీసుకోవడానికి తగినంత సమయం ఇచ్చేలా సంకేతం అందించండి.

**10.సడన్ బ్రేకింగ్ నివారించండి**

చలికాలంలో రోడ్డు తడిగా ఉండి, వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఎక్కువ. బ్రేకులను నెమ్మదిగా, జాగ్రత్తగా అప్లై చేయండి. సడన్ బ్రేకులు వేయడం వలన వాహనం అదుపు తప్పే ప్రమాదం ఉంది. నిర్దిష్టమైన వేగంతో వాహనాలను నడపడం ద్వారా స్కిడ్ కాకుండా నివారించవచ్చు. తెలంగాణ పోలీసు శాఖ చేసిన ఈ సూచనలను ప్రతి వాహనదారుడు తప్పక పాటించి, తమ ప్రయాణాన్ని సురక్షితంగా, విజయవంతంగా ముగించాలని విజ్ఞప్తి. కార్యక్రమంలో ఆర్టీవో జగదీశ్, ఏసీపీలు తిరుపతి రెడ్డి, రమణమూర్తి, శ్రీనివాసులు, కాలేజ్ చైర్మన్ నవీన్ సిఐలు మురళి, రాజు, సంజీవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# దిశలో 'బోదులబండ' ధ్వని!

- **సమస్యలపై గళమెత్తిన సర్పంచ్ నాగార్జున**
- **పారిశుద్ధ్య కార్మికుల కొరతపై జిల్లా అధికారుల దృష్టికి..**
- **రూ. 7.5 కోట్ల రోడ్డు పనులపై ఎంపీ, కలెక్టర్‌కు విన్నపం**
- **తొలి సమావేశంలోనే ప్రత్యేకత చాటుకున్న నూతన సభ్యుడు**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27(తెలంగాణ ముచ్చట్లు)**

జిల్లా అభివృద్ధి సమీక్షా వేదిక 'దిశ' సాక్షిగా ఒక గ్రామ సర్పంచ్ తనదైన ముద్ర వేశారు. నేలకొండపల్లి మండలం బోదులబండ సర్పంచ్, జిల్లా స్థాయి దిశా కమిటీ నూతన సభ్యుడు కట్టెకోల నాగార్జున శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాట పటిమను ప్రదర్శించారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ సమక్షంలో జరిగిన ఈ భేటీలో గ్రామీణ సమస్యలను ఏకరువు పెట్టి అందరి ప్రశంసలు అందుకున్నారు.

**పల్లె పారిశుద్ధ్యంపై 'గళం'**

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సవాల్‌గా మారుతోందని, తగినంత మంది కార్మికులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాగార్జున బలంగా వినిపించారు. పల్లెలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్య సిబ్బంది నియామకం తక్షణ అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ, కలెక్టర్.. త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**రోడ్డు పూర్తి చేయండి!**

బోదులబండ నుంచి పైనంపల్లి వరకు మంజూరైన రూ. 7.5 కోట్ల రోడ్డు నిర్మాణ పనుల జాప్యంపై ఆయన మాట్లాడారు. ప్రజల రవాణా సౌకర్యార్థం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. సర్పంచ్ విన్నపానికి స్పందించిన జిల్లా యంత్రాంగం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించింది.

**పొంగులేటి అభిమానిగా ప్రస్థానం మొదలై... దిశ కమిటీ సభ్యుడి వరకు**

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి వీరాభిమానిగా, క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన నాగార్జున.. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో 1,505 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచి రికార్డు సృష్టించారు. అతి తక్కువ కాలంలోనే జిల్లా స్థాయి కమిటీలో స్థానం సంపాదించి, తొలి సమావేశంలోనే తన వాగ్ధాటితో 'ప్రత్యేకం' అనిపించుకున్నారు. క్షేత్రస్థాయి సమస్యలను జిల్లా వేదికపైకి తీసుకెళ్లిన ఆయన తీరుపై సర్వత్రా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.



# ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి

- **ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్ రావు**
- **వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే దాస్యం**

**హనుమకొండ,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):**

ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్ రావు 24వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం కూడలి వద్ద నిర్వహించారు. ఆయన విగ్రహానికి భారత రాష్ట్ర సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని తక్కళ్లపల్లి వినీల్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బియ్యాల జనార్ధన్ రావు జీవితం సమాజం కోసం అంకితమైందని పేర్కొన్నారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకువచ్చి, వారి హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడిన వ్యక్తిగా ఆయనను గుర్తు చేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్‌తో పాటు సైద్ధాంతికంగా బియ్యాల జనార్ధన్ రావు విశేష కృషి చేశారని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజలకే దక్కాలనే లక్ష్యంతో ఉద్యమానికి బాటలు వేసినవారిలో ఆయన ఒకరని వివరించారు.

కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు విద్యాబోధనతో పాటు తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కావాల్సిన అవసరాన్ని వివరించి ప్రోత్సహించారని తెలిపారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై ఆధారాలతో సమాజానికి వివరించి ఉద్యమానికి దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి బుచ్చిబాబు, పేరాల కిషన్ రావు, జగదీశ్, చక్రధర్, రాజేష్, కొమురయ్య, రాకేష్ యాదవ్, వీరు, కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## అర్థమైందా !

అర్థంకాదు! అర్థంకాదు!
మీకు ఏదీ అర్థంకాదు!

ఎప్పుడైనా అర్థమైందా?
ఎప్పుడూ అర్థంకానివ్వం!

పురాణాలు! దేశచరిత్రలు!
అర్థమయ్యాయా మీకు?

సంస్కృతం అర్థమైందా?
అపౌరుషేయాలు రాసాం!

ఇంగ్లీష్ అర్థమైందా?
రెండువందలేళ్ళ పైమాటే!

చాకిరీలు చేసేవాళ్లకు
అర్థమవ్వటం ఎందుకు?

లక్షల కొద్దీ జీవరాసులు
అర్థమయ్యే జీవిస్తున్నాయా?

రానురాను తెలుగు కూడా
ఏమీ అర్థం కానివ్వం !

రాజకీయాలర్థమయ్యాయా?
నాయకులర్థమయ్యరా?

'కవిత'ను ఏం ప్రశ్నించారు?
మీకేమైనా అర్థమైందా?

TRS BRS ఎందుకైంది?
మీకేమైనా అర్థమైందా?

బిఆరెస్ బిజెపి బంధం!
మీకేమైనా అర్థమైందా?

'ఆప్'నాయకుల అరెస్టులు
మీకేమైనా అర్థమైందా?

బ్లాక్ మనీ పట్టుకుంటారు!
బ్లాక్ మెయిల్ చేస్తారు!

ఎవరితో ఎవరు'పొత్తు'లు?
ఎవరికి ఎవరు'చిత్తు'లు?

ఎన్నెన్నో గమ్మత్తులు
అర్థమౌతున్నాయా?

వెయ్యి నోట్లు రద్దు
రెండు వేలనోట్లు ముద్దు!

రద్దులు ముద్దులు
హద్దుల్లేని పద్దులు!

గుజరాత్ అస్మదీయులు
పదిలక్షలకోట్లు హాంఫట్లు!

రైతు కనీస మద్దతు ధర!
బారికేడ్లకు కందకాలకు ఎర!

బుల్డోజర్లు డబలింజన్లు
మీకు అర్థమయ్యాయా?

కాశ్మీరు ఎవరికోసం?
మణిపూర్ లో ఏంజరిగింది?

అయోధ్య రామాలయం!
ఆధ్యాత్మిక రాజకీయం!

ఎలక్టోరల్ బాండ్లు!
మాయమైన ఇవియంలు!

అయోధ్య రాముడున్నాడు!
ఆయన చూసుకుంటాడు!

ఢిల్లీలో 'భీముడు'న్నాడు!
'విచిత్రాలు' చేస్తుంటాడు!

మాకే గంపగుత్తగా ఓట్లు
మొత్తం పార్లమెంట్ సీట్లు!

ఎలాగైనా మాకే కావాలి!
ఎంతకైనా దిగజారాలి!

మీకు ఏమీ అర్థం కాదు!
మావన్నీ చిత్ర 'విచిత్రాలు'!

అవన్నీ అర్థమైతే మీరు
ఎందుకిలావుంటారు ?

మాలాగే ఉండేవాళ్ళు !
పోనీ ఇదైనా అర్థమైందా?

అర్థంకాదు అర్థంకాదు
ఏదీ అర్థం కానివ్వం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్





# శాంతినగర్ అంగనవాడి కేంద్రంలో పిల్లలకు పలకలు బ్యాగ్స్ పంపిణీ

- నిరుపయోగంగా ఉన్న బోరు పునరుద్ధరణ
- అంగన్వాడీ కేంద్రానికి కిటికీలు వితరణ
- 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27(తెలంగాణ ముచ్చట్లు):** వైరా లోని శాంతినగర్ లో ఉన్న అంగన్వాడి కేంద్రాల్లో 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో పిల్లలకు పలకలు స్కూల్ బ్యాగ్స్ శుక్రవారం అందించారు. అంగన్వాడి కేంద్రానికి కిటికీలు లేని కారణంగా అవసర నిమిత్తం నాలుగు కిటికీలను అందించారు. అదేవిధంగా గత కొన్ని సంవత్సరాలుగా అంగన్వాడి కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న మంచినీటి బోరును అధికారులతో మాట్లాడి పునరుద్ధరించారు. బోర్న్ ను పునరుద్ధించటం పట్ల ఆ వార్డు ప్రజలు కౌన్సిలర్ వరలక్ష్మిని శ్యాం బాబు అభినందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వరలక్ష్మి మాట్లాడుతూ 20 వార్డులో కావలసిన మౌలిక సదుపాయాలను అందిస్తామని వార్డులో మంచినీటి సమస్య డ్రైనేజీ రహదారుల మరమ్మత్తు చేయించుట తన ముఖ్య ఉద్దేశం అని ఆమె ఈ సందర్భంగా తెలిపారు ప్రతి బజారులో చెత్తాచెదారం పడవేయకుండా మున్సిపాలిటీ చెత్త బండిలో వేయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి వార్డులో ప్రతిరోజు పర్యటిస్తానని వార్డు సమస్యలను దగ్గరుండి చూసి పరిష్కరించే విధంగా ప్రజల సహకారంతో కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జిల్లా కమిటీ సభ్యులు తోటకూర శ్రీకాంత్ వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై బుచ్చి రామారావు 20వ వార్డు ముఖ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు వాంకుడోత్ బిఖ్య ఎస్ కే రహీం పందు ఎస్కే రజిద్ గుగులోతు లక్ష్మీబాయి దుర్గా విజయ్ గడ సందుల దర్గయ్య తేజ రవి తేజ సైదులు కొమ్ము భాస్కర్ భానోత్ బావ సింగ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.




# భూదాన్ భూముల ఆక్రమణలో తొలగించిన ఇండ్లవారి సర్వే..

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి- 27(తెలంగాణ ముచ్చట్లు):** ఈ నెల 24న ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామ భూదాన్ భూముల ఆక్రమణలో తొలగించబడిన ఇండ్లకు సంబంధించి, వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వేను వెంటనే చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టుటకు జిల్లాలోని 14 మంది తహశీల్దార్లకు ఆదేశాలు జారీచేసినట్టు కలెక్టర్ అన్నారు. ఇట్టి సర్వే అత్యంత త్వరితగతిన పూర్తిచేయుటకు తహశీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వే పూర్తయిన తర్వాత అర్హులైన వారికి ప్రభుత్వాదేశానుసారం నివాస స్థల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు చర్యలు చేపడతామన్నారు. తొలగింపబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తులు, వారి వారి గ్రామాల్లో అందుబాటులో ఉండి, సర్వేకు సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# బీసీల హక్కుల కోసం ఐక్య పోరాటమే మార్గం

**ఎంపీ ఈటల రాజేందర్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఆధ్వర్యంలో బీసీలకు బడ్జెట్ లో జరుగుతున్న అన్యాయంపై నిర్వహించిన నిరాహార దీక్షలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ మధుసూదన చారి, బాలరాజు గౌడ్, దుర్గయ్య, వెంకన్న, ఎలికట్టే విజయ్, బైరి శేఖర్, నారాయణ గౌడ్, అబ్బాస్, రమణ, శ్రీకాంత్, లింగేష్ యాదవ్, లలిత, మల్లిఖార్జున్ తదితరులు హాజరయ్యారు.తెలంగాణలో ఒకప్పుడు సామాజిక చైతన్యం ఉప్పొంగేదని, ఇప్పుడు అదే సమాజం నిర్వీర్యం అవుతుండటం ఆందోళనకరమని ఈటల రాజేందర్ అన్నారు. "చట్టం కూడా ఉన్నవాడి చుట్టంలా మారింది. పేదవాడికి న్యాయం మీద నమ్మకం పోయింది. ఇది సమాజానికి మంచిది కాదు" అని వ్యాఖ్యానించారు. బీసీలలో ఐక్యత పెరగాలని, "నీ రాజ్యం నువ్వు ఏలుకో" అనే నినాదం కార్యరూపం దాల్చాలని పిలుపునిచ్చారు.బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో డబ్బులున్నవారికే టికెట్లు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. "బడ్జెట్ కేటాయించామని చెప్పి ఐదు పైసలు కూడా ఖర్చు చేయకపోవడం మోసం" అని ఆరోపించారు."రాజ్యం ఎవరి చేతిలో ఉంటే వాడికే ఊడిగం చేస్తుంది" అని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం సంపద ప్రజల అవసరాలకు వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అయితే ఆ దిశగా అమలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఖమ్మంలో పేదల ఇళ్లు కూల్చివేత, గాజులరామారంలో జరిగిన ఘటనలు ప్రజాస్వామ్యానికి మచ్చ అని పేర్కొన్నారు. పేదలపై బుల్డోజర్లు నడిపించడం అన్యాయమని, పెద్దల భూకబ్జాలపై మాత్రం చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. ఎల్లమ్మబండ భూముల వ్యవహారంలో వేల కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిందని ఆరోపిస్తూ, ఆ నిధులతో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తీర్చవచ్చని అన్నారు.ప్రభుత్వం పేదల కోసమే ఉండాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. బీసీల ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, సామాజిక న్యాయం సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య

- న్యాయం జరిగే వరకు పోరాటం
- ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపే పరిష్కారం
- బాధితులను పరామర్శించిన కూనంనేని





**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 27(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మంలో పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య అని కనీసం నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, వితండవాదం చేస్తున్నారని పేదల పట్ల ఇలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. శుక్రవారం వెలుగుమట్ల నిర్వాసితులు ఆశ్రయం పొందుతున్న టిటిడిసి, అంబేడ్కర్ భవన్లో ని బాధితులను పరామర్శించారు. జరిగిన ఘటన గురించి తెలుసుకున్నారు. పేదలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ ప్రాంతం నుంచి వచ్చారు, ఎంత కాలంగా నివాసం ఉంటున్నారు, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్న కూనంనేని బాధితులకు కనీస అవకాశం ఇవ్వకుండా ఇలా వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాల నుంచి ఖమ్మం వచ్చి తలదాచుకునేందుకు భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకోవడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. మీరు పాకిస్తానీలు, బంగ్లాదేశ్ వారు కాదు కదా చుట్టు పక్కల వారే కదా అని ఆయన తెలిపారు. వెలుగుమట్లలోనే ఇల్లు ఇల్లు తిరిగి సర్వే చేసి ఒకవేళ అనర్హులు ఉంటే చర్యలు తీసుకుంటే బాగుండేదని అలా కాకుండా భయోత్పాత వాతావరణాన్ని సృష్టించి పిల్లలు, వృద్ధులు, మహిళలు "అనేది చూడకుండా వీధినపడేయటం ఏరకమైన ప్రజాస్వామ్యమని కూనంనేని ప్రశ్నించారు. ఒకసారి కాకపోతే పలుసార్లు సంప్రదింపులు జరపాలని పేదలను సంతృప్తిపరిచి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. సమస్యకు పరిష్కారం చూపకుండా బాధితులపై నేరం మోపడం అధికారం ఉంది. కదా అని ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూదాన్ భూముల్లో ఉన్న పేదలకు పట్టాలు అందజేస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించారని కూనంనేని గుర్తు చేశారు. పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని న్యాయం జరిగే వరకు పేదల పక్షాన పోరాడతామన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు ఈ విషయంలో చొరవ చూపి బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులకు సరైన ఆదేశాలు ఇచ్చి అవి అమలు జరిగే విధంగా చూడాలన్నారు. కొందరు కమ్యూనిస్టుల గురించి తెలియక స్వార్ధం కోసం విమర్శలు చేస్తున్నారని కూనంనేని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సుదీర్ఘ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదని వేల మందికి పోరాట ఫలితంగా నివాస స్థలాలు దక్కాయని ఆయన తెలిపారు. నాగార్జున సాగర్ కాలువ కట్టలపై గుడిసెలు వేసిన తర్వాత వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపి సంతృప్తి చెందిన తర్వాతే గుడిసెలు తొలగించడం జరిగిందని తెలిపారు. కమ్యూనిస్టు నాయకుడు ఉదయ్కుమార్ నగర్ పేరుతో వందలాది మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని సాంబశివరావు గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాడటం, పేదలకు అండగా నిలవడం మా బాధ్యత అని దానిని ఎవరు గుర్తు చేయాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పునరావాస కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని ఎక్కడ నుంచి తొలగించారో అక్కడే పేదలకు స్థలాలు కేటాయించాలన్నారు. ఉన్నతాధికారులు ఏ లక్ష్యం కోసం ఆ భూమి నుంచి పేదలను ఖాళీ చేయించారో వివరించాల్సిన అవసరం కూడా అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు. ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఆర్థిక సాధికారతకు గ్రామ దుకాణం ప్రారంభం

**వేలేరు,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థల సహకారంతో మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ దుకాణం ప్రారంభమైంది. ఈ దుకాణాన్ని సంబంధిత అధికారులు మరియు మండల సర్పంచుల వేదిక ప్రతినిధులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులకు స్థిరమైన విక్రయ వేదిక కల్పించడమే గ్రామ దుకాణాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేస్తున్న హస్తకళా వస్తువులు, చేనేత సంచులు, తయారీ దుస్తులు మరియు ఇతర గ్రామీణ ఉత్పత్తులను ఈ దుకాణం ద్వారా నేరుగా వినియోగదారులకు అందించే అవకాశం కల్పించినట్లు వివరించారు. దీంతో మహిళలకు అదనపు ఆదాయం లభించడంతో పాటు ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు పడుతుందని పేర్కొన్నారు. వేలేరు గ్రామంలో కూడా కుటీర పరిశ్రమలను ప్రోత్సహించి మహిళలకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించాలనే అభిప్రాయం వ్యక్తమైంది. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సహకారం కొనసాగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, మహిళా సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపి కావ్య ప్రవేశపెట్టిన అనాథ, వితంతువులు,ఒంటరి మహిళల సంరక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

**వరంగల్,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):** గత పార్లమెంట్ సమావేశాల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య ప్రవేశపెట్టిన అనాథ వితంతువులు, ఒంటరి మహిళల (రక్షణ, పునరావాసం, సంక్షేమం) బిల్లు-2025కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఈ బిల్లుకు సంబంధించిన అంశంపై పూర్తి వివరాలు పరిశీలించిన అనంతరం, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 117(3) ప్రకారం లోక్‌సభలో పరిశీలనకు సిఫార్సు చేసినట్లు లోక్‌సభ కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. ఈ విషయాన్ని కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి లోక్‌సభ ప్రధాన కార్యదర్శికి పంపిన లేఖ ద్వారా తెలియజేశారు.

మహిళల సంక్షేమం, గౌరవం, భద్రతను బలోపేతం చేయాలనే లక్ష్యంతో డిసెంబర్ 6న జరిగిన సమావేశాల్లో డా. కడియం కావ్య రెండు వ్యక్తిగత సభ్యుల బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తెలంగాణ నుంచి ఈ ఘనత సాధించిన తొలి మహిళా పార్లమెంట్ సభ్యురాలిగా ఆమె గుర్తింపు పొందారు. తాను ప్రవేశపెట్టిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన డా. కడియం కావ్య, అనాథ వితంతువులు, ఒంటరి మహిళల రక్షణ, పునరావాసం, సంక్షేమం దిశగా ఈ బిల్లు కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. చట్టపరమైన ప్రక్రియలతో మాత్రమే ఆగిపోకుండా, ఈ బిల్లు కార్యరూపం దాల్చి లక్షిత వర్గాలకు హక్కులు, భద్రత, సంక్షేమ ప్రయోజనాలు అందే వరకు కృషి కొనసాగిస్తానని స్పష్టం చేశారు.



# ములుగు రోడ్డులో నూతన ఆరెంజ్ ఫైనాన్స్ బంగారు రుణ కార్యాలయం ప్రారంభం

**హనుమకొండ,ఫిబ్రవరి27 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ ములుగు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరెంజ్ ఫైనాన్స్ బంగారు రుణ కార్యాలయాన్ని రెండవ డివిజన్ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్ మరియు సంస్థ ప్రతినిధి హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు సులభంగా, పారదర్శకంగా రుణ సదుపాయాలు అందించేలా ఈ కార్యాలయం సేవలు అందించాలని ఆకాంక్షించారు. అత్యవసర అవసరాల సమయంలో ప్రజలకు తక్షణ ఆర్థిక సహాయం అందే విధంగా సంస్థ పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో దిన్ సింగ్ విగ్నేష్, షేక్ రుహల్లా, శివ తదితరులు పాల్గొన్నారు. శాఖ నిర్వాహకుడు భాస్కర్, రాజు, రాజేష్, అరుణ్, వేణు కూడా హాజరయ్యారు. ఈ సేవలను వరంగల్ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డి.ఎడ్ రద్దు ప్రతిపాదన హాస్యాస్పదం

◆ డి.ఎడ్, ఉపాధ్యాయ నియామక పరీక్ష అభ్యర్థుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. కమల్

**నిజామాబాద్,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ విద్యా సంఘం సమర్పించిన ప్రతిపాదనలో డి.ఎడ్ కోర్సును రద్దు చేయాలని సూచించడం హాస్యాస్పదమని డి.ఎడ్, ఉపాధ్యాయ నియామక పరీక్ష అభ్యర్థుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. కమల్ తెలిపారు.విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ విద్యా విధానాలు-2026 ప్రతిపాదనలో డి.ఎడ్‌ను రద్దు చేసి పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో బి.ఎడ్, పీజీ అర్హతలను అనుసరించాలనడం విద్యా వ్యవస్థపై అవగాహనలేమిని సూచిస్తోందన్నారు.సర్వోన్నత న్యాయస్థానం మరియు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి మార్గదర్శకాల ప్రకారం ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయ నియామకాలకు డి.ఎడ్ అర్హతే వర్తిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష మొదటి పత్రం ఉత్తీర్ణులే ప్రాథమిక ఉపాధ్యాయ నియామకాలకు అర్హులని స్పష్టం చేశారు.గతంలో ఇదే పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో సంబంధిత నిబంధనల ప్రకారం డి.ఎడ్ అర్హత కలిగిన వారినే ప్రాథమిక ఉపాధ్యాయ పదవులకు నియమించారని గుర్తుచేశారు.

దేశవ్యాప్తంగా అమలులో ఉన్న డి.ఎడ్ కోర్సును రాష్ట్రంలో రద్దు చేయాలని సూచించడం సిగ్గుచేటని అన్నారు. సరైన అవగాహన లేకుండా తీసుకునే నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి డి.ఎడ్ రద్దు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులతో కలిసి ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం

◆ రిలే నిరాహార దీక్షలకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మద్దతు

**వనపర్తి,ఫిబ్రవరి27(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి లో గత నాలుగు రోజులుగా న్యాయవాదులు తమ రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సందర్శించి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పెడధోరణులు పెరుగుతున్న నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ కరువవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదుల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి కేసునైనా వాదించకూడదనే హక్కు న్యాయవాదికి ఉండదని, కక్షిదారునికి న్యాయం చేయడమే వారి వృత్తి ధర్మమని స్పష్టం చేశారు. అంతమాత్రాన వ్యక్తిగత కక్ష పెంచుకొని దాడులకు దిగడం అవివేకమని పేర్కొన్నారు.సమాజ పరిస్థితులు ఎలా ఉన్నా యువ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదుల సలహాలు తీసుకుని న్యాయాన్ని నిలబెట్టాలని సూచించారు.వృత్తిలో ఈర్ష్య, ద్వేషాలు విడిచి తమ ప్రతిభతో మంచి పేరు సంపాదించుకోవాలని కోరారు. న్యాయవాదులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని నిరంజన్ రెడ్డి తెలిపారు.



# అఖిల్ ‘లెనిన్’పై భాగ్యశ్రీ భారీ ఆశలు

సినిమా ప్రపంచంలో అడుగుపెట్టే ప్రతి నటికీ అందం, అభినయం ఉండటం సహజమే. కానీ విజయ శిఖరాన్ని చేరుకోవాలంటే వీటితో పాటు అదృష్టం కూడా తోడవ్వాలని చెబుతున్నారు సినీ విశ్లేషకులు. కొందరు తొలి చిత్రంతోనే అగ్రస్థానానికి చేరుకుంటే, మరికొందరు మంచి ప్రతిభ ఉన్నా సరైన అవకాశానికి నిరీక్షించాల్సి వస్తుంది. ప్రస్తుతం యువ నటి భాగ్యశ్రీ బోర్సే పరిస్థితి కూడా అలాంటిదేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి. తన అందం, చిరునవ్వుతో కుర్రకారును ఆకట్టుకున్న ఆమె, తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు పొందింది. సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆదరణ దక్కించుకున్నా, కెరీర్ పరంగా మాత్రం ఇప్పటివరకు ఘనవిజయం అందుకోలేకపోయింది. గ్లామర్ పరంగా ప్రశంసలు అందుకున్న ఈ భామకు, బలమైన కథతో కూడిన విజయమే ఇప్పుడు అత్యవసరంగా మారింది. అందుకే ప్రస్తుతం ఆమె ఆశలన్నీ ఒకే చిత్రంపై కేంద్రీకృతమయ్యాయి. ఆ చిత్రం మరెవరో కాదు అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటిస్తున్న “లెనిన్”. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై పరిశ్రమలో మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రూపొందుతున్న ఈ భారీ ప్రాజెక్టు వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ పాత్రకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండబోతుందని, ఆమె గ్లామర్‌కు తోడు నటనకూ మంచి అవకాశం లభించిందని చిత్రబృందం చెబుతోంది. ఈ సినిమా విజయం అఖిల్‌కే కాకుండా భాగ్యశ్రీకి కూడా కీలకమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అఖిల్‌కు ఇది కెరీర్‌లో మలుపుతిప్పే అవకాశమైతే, భాగ్యశ్రీకి ఇది స్టార్ స్థాయికి తీసుకెళ్లే వేదికగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. సరైన కథ, భావోద్వేగాలు, సంగీతం కలిసొస్తే ఈ జోడీ వెండితెరపై మాయ చేయగలదని అభిమానులు ఆశిస్తున్నారు.

అందం, ప్రతిభ ఉన్నా సరైన సమయంలో సరైన విజయం రాకపోతే గుర్తింపు దక్కదనే నిజం చిత్రరంగంలో తరచూ వినిపిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో భాగ్యశ్రీకి “లెనిన్” చిత్రం అదృష్టాన్ని తీసుకురావాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. ఈ వేసవిలో ఈ జోడీ ప్రేక్షకులను ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి. విజయమే ఆమెకు ఎదురుచూస్తుందా లేదా అన్నది విడుదల తర్వాతే తేలనుంది.

# ‘ఉస్తాద్ భగత్‌సింగ్’పై భారీ హైప్.. ఓటీటీ డీల్ ఏకంగా రూ.80 కోట్లా?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా అంటేనే అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంటుంది. ముఖ్యంగా గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు హరీష్ శంకర్తో మళ్లీ చేతులు కలపడంతో ఉస్తాద్ భగత్ సింగ్పై ప్రారంభం నుంచే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మార్చి 26, 2026న ప్రేక్షకుల ముందుకు రానుండగా, విడుదలకు ముందే వ్యాపార పరంగా రికార్డు స్థాయి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. పవన్ శైలికి తగ్గ మాస్ అంశాలు, భావోద్వేగ నాటకంతో హరీష్ శంకర్ కథను మలిచినట్లు సమాచారం. సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. గతంలో ‘జల్సా’, ‘అత్తారింటికి దారేది’, ‘గబ్బర్ సింగ్’ వంటి చిత్రాలకు ఆయన అందించిన ఆల్బమ్‌లు విశేష ఆదరణ పొందిన నేపథ్యంలో ఈసారి కూడా పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రచారంలో భాగంగా విడుదలైన ‘ఆరా ఆఫ్ ఉస్తాద్’ పాట సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతుండగా, ‘దేఖ్‌లేంగే సాలా’ పాటకూ మంచి స్పందన లభించింది. ఇంకా రెండు పాటలు విడుదల కావాల్సి ఉండగా, మార్చి రెండో వారంలో ట్రైలర్ విడుదలకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. డిజిటల్ హక్కుల విషయంలో ఈ చిత్రం భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రముఖ వేదిక నెట్‌ఫ్లిక్స్ సుమారు రూ.80 కోట్లకు ఓటీటీ హక్కులను సొంతం చేసుకున్నట్లు ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. పవన్ గత చిత్రం ‘ఓజీ’కు ఓటీటీలో మంచి ఆదరణ లభించిన నేపథ్యంలో ఈ ఒప్పందం సులభంగా పూర్తైందని అంటున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. థియేట్రికల్ వ్యాపార పరంగా కూడా చిత్రం మంచి మార్కెట్ సాధిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రాల వారీగా పంపిణీ హక్కులపై చర్చలు కొనసాగుతుండగా, విదేశీ హక్కుల వ్యవహారం కూడా తుదిదశకు చేరుకున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. విడుదలకు ముందే ఈ స్థాయి హైప్ సృష్టించిన ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం నమోదు చేస్తుందో చూడాల్సి ఉంది.

# రెండు భాగాలుగా రానున్న ‘స్వయంభు’... నిఖిల్ సిద్ధార్థ్ భారీ ప్రణాళికలు



యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా స్వయంభుపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం 2026 ఏప్రిల్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు విశేష స్పందన లభించడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. తాజాగా ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు నిఖిల్ స్వయంగా వెల్లడించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. కథ విస్తృతి, విజువల్ వైభవం దృష్ట్యా చిత్రాన్ని రెండు భాగాలుగా తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. పీరియాడిక్ నేపథ్యంతో యాక్షన్, భావోద్వేగాల సమ్మేళనంగా కథ రూపొందుతున్నట్లు తెలుస్తోంది. భారీ వ్యయంతో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సినిమా తెరకెక్కుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ‘స్వయంభు’తో పాటు నిఖిల్ చేతిలో మరి కొన్ని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న కార్తికేయ 3పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. అలాగే రామ్ వంశీ కృష్ణ తెరకెక్కిస్తున్న ది ఇండియా హౌస్ చిత్రం దేశవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ ప్రాజెక్టులు నిఖిల్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే అవకాశమున్నట్లు భావిస్తున్నారు.

కేవలం వెండితెరపైనే కాకుండా డిజిటల్ వేదికలపై కూడా తన ముద్ర వేయడానికి నిఖిల్ సిద్ధమవుతున్నాడు. త్వరలోనే ఒక వెబ్ సిరీస్‌తో ఓటీటీ ప్రవేశం ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించాడు. విభిన్న కథాంశాలు, కొత్త భావనలతో ముందుకు సాగుతున్న నిఖిల్, తన కెరీర్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నాడు. రెండు భాగాలుగా రానున్న ‘స్వయంభు’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in